# బెర్హాంటి రెస్ట్ హౌస్

**వాస్కోటి జానకిరాం**

> దయ్యాలు ఉన్నాయని కొందరు, లేవని కొందరు ఆదికాలం నుంచి ఇప్పటి వరకు వాదించుకొంటున్నారు. ఉన్నాయో లేవో ఎవరికీ తెలియదు. కాని కొందరి అనుభవం మాత్రం దయ్యాల ఉనికిని బలపరిచేదిగా ఉంది. ఉన్నాయేమో, మరి!

నేను అక్కడికి చేరుకొనేసరికి సాయంత్రం నాలుగయింది. కలప కోసం వెళ్ళే లారీలో వచ్చాను. ఎక్కుడు దిగుడుల రోడ్డు. పట్నంనుని పదిమైళ్ళ ప్రయాణానికే ఒళ్ళంతా హూనమయింది.

ఆగస్టు నెల అయిదవ రోజు. గురువారం. చల్లగా ఉండవలసిన సాయంకాలం. ఒక్కటే ఉక్క పోస్తోంది. గాలి ఆడడంలేదు. నల్లని మేఘాలు కమ్ముకొంటున్నాయి. వర్షం వచ్చేలా ఉంది.

దట్టంగా, ఏపుగా పెరిగిన ప్లాంటేషన్ టేకుచెట్ల మధ్య ఉంది, ఎప్పుడో ఏ బ్రిటిష్ ప్రభుత్వంకాలంలోనో కట్టించిన ఫారెస్టు రెస్ట్ హౌస్. చిన్నదయినా అతి ముచ్చటగా ఉంది. అది ఈ శతాబ్దంలో కట్టింది మాత్రం కాదు. బంగళా చుట్టూ నానా రకాల తీగలతోనే కాంపౌండులా అల్లించారు. చక్కటి పూల మొక్కలు, క్రోటన్సు వేశారు. దానికి ఎదురుగా ప్రత్యేకించబడిన స్థలంలో నెహ్రూలాంటి నాయకులు నాటిన అశోక వృక్షాల మొక్కలు కొత్త అందాలు చిమ్ముతూ పెరుగుతున్నాయి. ఈ మొక్కల ముందు నాటిన శిలాఫలకాలు సమాధుల్లా ఉన్నాయి.

మా ఆఫీసరుగారు రాలేదు. తమ కార్యక్రమం మార్చుకొన్నట్లు కబురు పంపారు. అప్పటికి ఆరున్నర అయింది. పొద్దు గూకింది కూడా. తిరిగిపోవడానికి నాకు బస్సులుగాని, లారీలుగాని లేవు. చూస్తూండగానే దట్టమైన చెట్లకింద చిక్కటి చీకటి నీడలు వ్యాపించాయి. రకరకాల అడివి పక్షులు వింత వింత శబ్దాలు చేస్తున్నాయి. అడివిలో ఉండగా పొద్దుగూకడం నా జీవితంలో అదే మొదటిసారి. ఏదో కొత్తగా, భీతిగా, ఆనందంగా ఉంది. అదొక అనుభవం.

బంగళాకు కొద్ది దూరంలో ఒక్క రేంజరు నివాసం మాత్రం ఉంది. రెస్ట్ హౌస్‌తోబాటు దానిని కూడా కట్టినట్లుంది. అతి పురాతనమయిన కట్టడం. అంత పెద్ద అడివిలో, వన్య మృగాల మధ్య ఉన్న ఆ ఇంట్లో రేంజరు, అతని భార్య, ఇద్దరు పిల్లలు మాత్రం ఉన్నారు. రాత్రులలో మనం వీధి కుక్కల అరుపులు విన్నట్లు, వాళ్లకు పెద్దపులుల గాండ్రింపులు, కొండ చిలవల బుసబుసలు వినడం అలవాటయిపోయింది. ఒక్కొకసారి ఏ చిరుతో, పెద్దపులో పొద్దెక్కేంత వరకు వాళ్ల వరండాలోనే పడుకొని నిద్రపోతూ ఉంటుందిట! అల్లాంటిచోట ఆయన భార్యతో, పిల్లలతో బాటు వేసవికాలంలో ఆరుబయటనే పండుకొంటాడట. ఈ మాటలు వింటూంటేనే నా ఒళ్ళు గగుర్పొడిచింది.

కరెంటు లేదు. ఓ పాత పెట్రొమాక్సు లైటు వెలిగించాడు వాచ్‌మన్.

అక్కడికి ప్రముఖ మంత్రులు, పెద్ద పెద్ద ఆఫీసర్లు తరుచుగా వస్తూంటారు కాబట్టి, వారి కోసమని విలువయిన ఫర్నిచరు, రంగురంగుల కర్టెన్సు, చక్కని పింగాణీ సామానులు, ఇంకా కావలసిన వసతులన్నీ ఏర్పాటు చేసింది ఫారెస్టు డిపార్టుమెంటు.

ఎప్పుడో ఒక పూట ఓ గంటో, రెండు గంటలో విశ్రమించి పోయేవారికి అక్కడి ప్రకృతి సౌందర్యవంతంగా, ఆనందదాయకంగా కనిపించవచ్చు. కాని, నిరంతరమూ ఆ చెట్ల మధ్య ఓ చెట్టులా బతికే రేంజరు లాంటి ఒంటరి జీవికి ఆ ప్రకృతి ఎంత విసుగ్గా, ఆ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో అక్కడ ఉన్న కొంతసేపట్లోనే నేను తెలుసుకొన్నాను.

ఒంటరిగా ఉన్న ఫారెస్టు రేంజరు పొద్దుపోక చాలాసేపు నాతో మాట్లాడుతూ కూర్చున్నాడు. పాపం! అతనికి నా లాంటివారు ఎప్పుడో అరుదుగా దొరుకుతారు. ఇక ఆ దినం అతనికి పండగ. ఏమాత్రం దాచుకోకుండా తన ఆదరణ అంతా వెళ్లగక్కుతాడు. నిజంగా, అతిథి సత్కారం అంటే ఏమిటో ఆయన దగ్గిర చూసి నేర్చుకోవాలి. ఆ రాత్రి నాకు కూడా తన ఇంటిలోనే వంట చేయించి భోజనం పంపాడు.

ఎట్లాగయితేనేం, రాత్రి ఏ పదింటికో రేంజరు నన్ను ఆ దిక్కుమాలిన బంగళాలో ఒంటరిగా వదిలి తన ఇంటికి వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోయినందుకు నాకు బాధ లేదు. పైగా, కొంత విశ్రాంతి కూడా పొందాను.

సన్నగా గాలిదుమారం రేగింది. చిటపట చినుకులతో ప్రారంభమయిన వర్షం కుంభవృష్టిగా కురియసాగింది. అందుకే కాబోలు సాయంత్రం అంతగా ఉక్కపోసింది.

భోజనం చేసి పడుకొన్నాను. బయటి వరండాలో ముసలి వాచర్ నిండుగా ముసుగుతన్ని నిద్రపోతున్నాడు. అంత వర్షపు హోరులో కూడా వాడి గురక స్పష్టంగా వినిపిస్తోంది.

గది మధ్య ఉన్న బల్లమీద పాత పెట్రొమాక్సు లైటు గుయ్ మని శబ్దం చేస్తూ మండుతూంది. దాని చుట్టూ రకరకాల పురుగులు చేరుకొన్నాయి.

నట్టడవి. కారు చీకటి. హోరున వర్షం. నాకేదో ఒంటరిగా దిగులుగా ఉంది. చదువుకొనేందుకు పుస్తకమయినా లేదు. ఊరికే పక్కమీద అటూ ఇటూ పొర్లుతూ పడుకొన్నాను. ఎప్పుడో కలత కలతగా నిద్ర పట్టేసింది.

అట్లా ఎంతసేపు నిద్రపోయానో తెలియదు. ఒక వేళలో హఠాత్తుగా మెలకువ వచ్చింది. గడియారం చూస్తే రాత్రి ఒంటి గంట అయింది. గది అంతా కటిక చీకటిగా ఉంది. ఆ గుడ్డి పెట్రొమాక్సు లైటు కూడా ఎప్పుడో ఆరిపోయినట్లుంది. బయట వాన వెలిసింది. సింగిని చుక్కలు వెలుగుతున్నాయి. చుట్టూ ఉన్న అడివిలోనుంచి రకరకాల వింత శబ్దాలు వినవస్తున్నాయి. దానికితోడు వాన నీటికి కప్పల బెకబెకలు, కీచురాళ్ల రొద ఎక్కువయినాయి.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది, నా చుట్టూ ఉన్నది కారడవి అనీ, నేను ఒంటరిగా ఉన్నాననీ. ఈ ఆలోచనతో నాకు ఎక్కడలేని భయము పట్టుకుంది.

మరికొద్ది క్షణాల్లో నా గదిలో ఎవరో ఉన్నట్లు పసికట్టాను. మెత్తని అడుగుల చప్పుడు, గట్టిగా శ్వాస వదులుతున్న శబ్దం స్పష్టంగా వినవచ్చింది. భయంతో నా ఒళ్ళు గగుర్పొడిచింది. గుండె దడ ఎక్కువయింది.

ఈ అడవిలో చెంచులు ఉన్నారనీ, ఒంటరిగా పోయే ప్రయాణీకుల్ని వాళ్లు దోచుకొంటారనీ విన్నాను. పైగా, ఏమాత్రం అడుకున్నా హత్యలు కూడా చేస్తారని విన్నాను. నా గొంతుల్లో తడి ఆరిపోయింది. నాకు కూడా అవసాన కాలం దగ్గిర పడుతూన్నట్లు తోచింది. ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకొని, గట్టిగా మంచానికి కరుచుకొని పడుకొన్నాను, మనస్సులో ఆంజనేయ దండకం చదివిస్తూ.

సాయం కోసం బిగ్గరగా అరవాలనిపించింది. మళ్లీ వృథా అని తెలుసుకొన్నాను. ఆ వేళలో, ఆ అడివిలో నా ఆర్తనాదం వినేందుకు ఎవరున్నారు?

బయట ఉన్న వాచర్ని పిలుద్దామనుకొన్నాను. పిలిచానేమో కూడా. కాని, నా గొంతులోనుంచిమాట పెగల్లేదు. వాడు వరండాల్లో నిశ్చింతగా గుర్రుపెట్టి నిద్ర పోతూనే ఉన్నాడు.

అల్లాగే స్థాణువులా కొంతసేపు పడుకొన్నాను చీకట్లో కళ్ళు పెద్దవి చేసి, చెవులు రిక్కించి వింటూ.

*ఉన్నట్లుండి నా గదిలో ఓ మూలనుండి ఏడుపు* ధ్వని వినవచ్చింది. ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. అది స్త్రీ కంఠం. సందేహం లేదు.

గదిలో ఉన్నది ఆడది అని తెలిసిన తరవాత నాకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. లేచి మంచం మీద కూర్చుని అగ్గిపుల్ల వెలిగించాను. ఓ పొడుగాటి స్త్రీ ఆకారం కనిపించింది. నావైపు వీపు ఉంచి గోముఖానికి చేతులు కప్పుకొని కిటికీ దగ్గిరగా నిలబడి ఉంది. కిటికీ తెరిచే ఉంది. పొడుగాటి జడ, వెడల్పయిన వీపు, సన్నని నడుము, తెల్లని చీర—ఇవే ఆ కొద్ది క్షణాల అగ్గిపుల్ల వెలుగులో నాకు కనిపించినవి.

నా ఆశ్చర్యానికి అంతులేదు. ఈ అడివిలో, ఇంత రాత్రివేళ ఒంటరిగా రెస్ట్‌హౌస్‌లోకి వచ్చిన ఆమె ఎవరయి ఉంటుంది? అసలు ఇక్కడికి ఎందుకు వచ్చింది? కొంపతీసి మోహినీ పిశాచం కాదు కదా? నాలో కోటి సందేహాలు. ఒక్కదానికీ జవాబు లేదు.

"ఎవరు?" అన్నాను, గొంతు సవరించుకొని. చీకటిలో నా గొంతు ప్రతిధ్వనించింది. జవాబులేదు. సన్నని రోదన మాత్రం వినిపిస్తూంది.

చీకట్లోనే తడుముకొంటూ వెళ్లి ఆమె దగ్గిరగా నిలబడ్డాను. మరో అగ్గిపుల్ల గీశాను. ధైర్యం చేసి ముఖంపై నుంచి ఆమె చేతులు తీసివేశాను.

అందమయిన ముఖం. పెద్ద పెద్ద కళ్లు. ఏడ్చి ఏడ్చి కళ్లు, చెంపలు బాగా ఎరుపెక్కాయి. కన్నీటికి తడిసి కళ్ల కింది కాటుక అంతా చెరిగి అక్కడక్కడ మరకలయింది.

"ఎందు కేడుస్తున్నావు?" అన్నాను మళ్లీ, మెల్లిగా గడ్డం కింద చెయ్యి వేసి ఆమె ముఖం పైకి ఎత్తుతూ. నాలో ధైర్యంతోపాటు పురుషత్వం కూడా పుంజుకొంటూ ఉంది.

ఈసారి కూడా జవాబులేదు, ఏడుపులు, ఎక్కిళ్లు తప్ప.

ఒంటరితనం. అంత చొరవ మరొకచోటయితే వీలుకాదు. ఆమె తల నిమురుతూ అనునయించాను. ఇంకా ఎక్కువగా ఏడుస్తూ ఆమె నా ఒడిలో వాలిపోయింది.

చాలాసేపు ఓదార్చిన తరవాత ఆమె తన ఆత్మకథ చెప్పింది. ఆమె పోరెస్టు వాచర్ గురవయ్య పెద్ద కూతురు. పేరు నిర్మల. వయస్సు ఇరవై ఉంటుంది. అందగత్తె. పాపం, చిన్నప్పుడే, అంటే తన ఆయిదవ ఏటనే మేనరికమని ఆమెను ఓ ముసలివాడికిచ్చి పెళ్లి చేశారు. అప్పుడు అతని వయస్సు నలభై లోపుగానే ఉండేది. ఇప్పుడు యాభై దాటాయి. ముందర రెండు పళ్లు కూడా ఊడిపోయాయి. ఇప్పుడు వచ్చి కాపరానికి పంపమని తొందర చేస్తున్నాడు. తనకు ఇష్టంలేదు. ఇంతకుపూర్వం రెండుసార్లు తన కిష్టం లేదని వెళ్లగొట్టేసింది. ఓసారి బలవంతాన శోభనం గదిలోకి పంపితే, గాజుముక్కలు తిని ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించింది. తనను లారీలో వేసికెళ్లి కర్నూలు ఆస్పత్రిలో చేర్పించారు. అతి కష్టంమీద బతికి బయటపడ్డది. దానితో అందరూ హడలెత్తిపోయారు. మళ్లీ చాలాకాలం వరకు ఎవరూ ఆమె జోలికి రాలేదు.

అయితే, ఈసారి గట్టి ప్రయత్నంమీద వచ్చినట్లుంది. అవతలివారు అంత సులభంగా పోయేట్లుగా లేరు. ఏదో ఒకటి తెంచుకొని పోవాలని వారి ప్రయత్నం. ఆ పూట పగలు పెద్ద పంచాయతీ జరిగిందిట. పంచాయతీలోని పెద్దమనుషు లందరూ తను భర్తతో కాపరానికి పోవాలని, లేకపోతే పెళ్లి ఖర్చులకు, తదితర ఖర్చులకుగాను తన తండ్రి వారికి మూడువేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని తీర్మానించారు. తన తండ్రి దగ్గిర మూడు రూపాయలయినా లేవు. మూడువేలు ఎక్కడి నుండి తెచ్చి ఇస్తాడు? ఇక విధి లేక తనను కాపరానికి పంపడానికి నిశ్చయించారు. ఆ మరునాడే ప్రయాణం.

తను ఆ రాత్రి చాలాసేపు ఆలోచించింది. ఆ ముసలి భర్తతో కాపరం చెయ్యడం కంటే చావు మేలు. చావు కోసం ప్రయత్నించి అప్పుడే ఓసారి విఫలురాలయింది. మనస్సు ఒకచోట, మనుగడ మరొకచోట తన కిష్టంలేదు. ఆలోచించి ఆలోచించి చివరికి ఈ నిశ్చయానికి వచ్చింది. తెగించి పారిపోయి వచ్చింది. ఆ సాయంత్రం బయట పచార్లు చేస్తూంటే నన్ను చూసిందిట. రేంజరు బంగళా పక్క ఉన్న చిన్న పెంకుటిల్లు వాళ్లదేనట. ఈ అడివిలోనుంచి ఇంత రాత్రిపూట ఒంటరిగా పోయే ధైర్యం లేక, నే నేమయినా సాయపడతానేమోనన్న ఆశలో వచ్చిందిట.

పారిపోయి ఏం చేస్తావన్నాను. ఆమె చెప్పేంతవరకు నాకు తెలియలేదు. తను ఆత్మకూరులోనే స్కూలు ఫైనలు తరవాత టీచరు ట్రెయినింగ్ కూడా పాసయిందిట. దూరంగా ఎక్కడికయినా పోయి ఉద్యోగం చేసుకొంటానంది. మనస్సుకు నచ్చినవాడిని వివాహం చేసుకొంటానంది. ఆమె చక్కని ఇంగ్లీషు కూడా మాట్లాడింది.

నిర్మల మనస్థైర్యానికి, సాహసానికి మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

అదృష్టం కొద్ది నాకు ఇంకా పెళ్లి కాలేదు. గత


ఏటి నుంచి గూటికి

చిత్రం—ఎస్. బాబూరావు (విజయవాడ.3)

మూడేళ్ళ నుండి సంబంధాల కోసం వెతుకుతున్నాను. తగిన సంబంధం కనిపించలేదు.

నాకు గవర్నమెంటులో మంచి ఉద్యోగం. మూడు వందల రూపాయల జీతం. అడదానికి కావలిసినంత అందమూ, ఆదరణా నాలో ఉన్నాయి.

ఈ నాడు దేవుడు కరుణించి నాకొక వరంలా ఈమెను ప్రసాదించాడు. ఆమె కిష్టమయితే పెళ్లి చేసుకొందామని నిశ్చయించుకొన్నాను. మనస్సులోని మాట దాపరికం లేకుండా ఆమెకు చెప్పివేశాను. ఆమె ఆనందానికి అంతు లేదు. చటుక్కున వంగి నా పాదాలు పట్టుకొంది, కృతజ్ఞతాపూర్వకంగా.

ఆమెను లేవదీసి నామంచం మీదికి తీసుకువెళ్లాను. ఆమె ఏ అభ్యంతరం చెప్పలేదు. ఎంతకు ముందు ఎన్ని యుగాలుగానో మేము భార్యాభర్తల మయినట్లు నా ఒడిలో ఒరిగి కరిగిపోయింది.

బాగా అలసిపోయానేమో, తెల్లవారుజామున గాఢంగా నిద్ర పట్టేసింది. మానులాపడి నిద్ర పోయాను.

మరునటి దినం నిద్ర లేచేసరికి బాగా పొద్దెక్కింది. తెరిచిన కిటికీలోంచి తీక్ష్ణమైన ఎండ పడుతూంది. నా పక్కలో చూస్తే ఆమె లేదు!

నాకు ఇంకా నిద్రమత్తు సరిగ్గా వదలలేదు. పైగా, ఒళ్లంతా ఒక్కటే నొప్పులుగా ఉంది. బద్ధకంగా ఆవలిస్తూ తిరిగి పడుకొన్నాను.

రాత్రి జరిగిందంతా కలా? నిజమా? అనిపించింది. కల అని ఎట్లా అనుకోను? నా పక్కనే ఆమె పడుకొన్న చోట పరుపు మీద గుంట పడి ఉంది. రాత్రి మా ప్రణయ చిహ్నంగా, ఆమెవి పగిలిన ఎర్ర గాజుముక్కలు ఇంకా పరుపు మీదనే పడి ఉన్నాయి.

బాత్‌రూమ్‌లో అలికిడి వినిపించింది. ఆమె బాత్‌రూమ్‌లో ఉన్నట్లుంది. ఒక్క దూకులో బాత్‌రూమ్‌లోకి వెళ్లాను. ముసలి వాచరు గురవయ్య మాత్రం నీళ్లు తోడుతున్నాడు. ఆమె కనిపించలేదు! తండ్రిని చూసి దాక్కొన్నదేమో! పక్క గదిలో చూశాను. ఎక్కడా కనిపించలేదు.

నా ఆశ్చర్యానికి అంతు లేదు. ఆమె ఏమయినట్లు? తెలియదు. నా కెందుకో అనుమానం కలిగింది. హేంగరు పై ఉన్న నా కోటుజేబులు చూసుకొన్నాను పర్సుకోసం. పర్సు ఉంది.

తరవాత విచారించగా తెలిసింది, వాచర్ గురవయ్యకు భార్యకాని, పిల్లలుకాని, లేరని. అసలు అతనికి పెళ్లే కాలేదట!

* * *

ఇది జరిగిన కొన్నాళ్లకు ఆపుట్టుపట్ల పెద్దపులి ఓ. చెంరేగాయి, భైర్లూటి రెస్టు హౌస్‌లో ఏదో మోహిని పిశాచం ఉందనీ, అక్కడికి వచ్చే ప్రయాణీకుల పీడిస్తూ ఉంటుందనీ.

ఈ పుకార్లు విని ఎవరూ అక్కడికి పోవడం మానేశారు.

ఆరు నెలలు తిరక్కముందే ఎంత అందమయిన ఆ రెస్టుహౌస్ ఎవరూ లేక పూర్తిగా పడిపోయింది. ★